
# విజయభాను



= రచన : శ్రీ టి. సత్యనారాయణమూర్తి =

ప్లాట్ ఫారం మీద ప్యాసింజరు కదలడానికి సిద్ధంగా వుంది. నేను హడావుడిగా పరుగెత్తుకుంటూ వచ్చి, ఒక చిన్న కంపార్టుమెంటులో ఎక్కడం, గార్డు విజిల్ తోపాటు ట్రయిను కదలడం ఒకేసారి జరిగాయి. ఒక్క నిముషం ఆలస్యం అయితే రాత్ర బండే ప్రాప్తం అయేది!

లయబద్ధమైన చిన్న కుదుపుతో పరిసర ప్రాంతాన్ని దూనం చేసుకుంటూ పాసింజరు ముందుకు దూసుకు పోతూ వుంటే, నాకు నిన్న వచ్చిన నాన్నగారి ఎక్స్ ప్రెస్ లెటరుమీదకు ఆలోచనలుపోయాయి. ఆ వుత్తరం గుర్తుకు వచ్చేసరికి ఒక్క నిముషం చికాకు అనిపించింది. అందులో సారాంశం ఇది: 'నీకోసం ఎదురు చూస్తూ వుంటాము. ఈ వుత్తరం అందిన వెంటనే బయలుదేరి రావలయును. శుక్రవారంనాడు మనం వేరే వూరు వెళ్ళవలసి వున్నది. మిగతా విషయాలు వచ్చేక మాట్లాడుకోవచ్చును' అంతే! నిన్న సాయంత్రానికి నా చేతికి వుత్తరం అందింది. ఈ రోజు సాయంత్రానికి మా వూరు ఎగిరిపోవాలి! ఆయన ఎప్పుడూ ఇంతే. విషయాన్ని అసలు పూర్తిగా తెలియచెయ్యరు. ఆయన చెప్పిన దానికి తిరుగు వుండకూడదని ఆయన వుద్దేశ్యం. తిరిగి ఏమన్నా అన్నామా, ఇంటిల్లిపాదీ మహాభారత యుద్ధమే. ఇదివరకు ఎన్నోసార్లు తప్పించుకు తిరిగాను ఈసారి తప్పలేదు.

కిటికీలోనుంచి దృష్టి మరల్చి ఒకమారు నేను కూర్చున్న కంపార్టుమెంటు పరికించాను. అంతవరకూ చూడనే లేదు. అది చాలా చిన్నది. పదహారు మంది మాత్రం కూర్చునేందుకు వీలైన పెట్టెఅది. అందులో నేను, నాకు ఎదురుగా అవతలి సీటులో కూర్చొని, బయటకు చూస్తున్న ఒక స్త్రీ మాత్రమే వున్నాం. అటు వైపు తలుపుతీసి వున్నందున గాలిలోనకు వస్తున్నది లేచి ఆ తలుపు వేసాను. అప్పుడు ఆమె ముఖంలోకి చూసే అవకాశం కలిగింది. వయస్సు ఇరవయ్యేళ్ళకు పైని వుండదు. మంచి ఏపుగా పెరిగిన శరీరం మూలంగ పదేళ్ళు ఎక్కువ వయస్సు అనిపిస్తుంది.

ఏదో స్టేషను వచ్చింది. గబగబా ఇద్దరు ఆడవాళ్ళు నెత్తిమీద మూటలు పెట్టుకొని పెట్టెలోకి ఎక్కబోయారు. అది పరుపుల బండేలూ, దిగండి. మావుసారుగా ఎక్కేరుగాని, బయట నుంచి ఓ తలపాగా ఆసామి అరిచాడు బహుశా నన్ను ఒక్కడిని చూసేమో— నాకు నవ్వు వచ్చింది. పుస్తకం చదువుతున్నట్లు కనిపించినా ఆ మాటకు ఆమెకూడా నవ్వినట్లు గ్రహించాను. వాచీ చూసేను. తొమ్మిదింపావు అయింది. ఇంకా ఈ బండి కదలదేం? అగిన ప్రతీ స్టేషనులోనూ ఇది నా స్వంతవూరు, నా యిష్టం వచ్చినంత సేపు వుంటాను అనే టెక్కు మన ప్యాసింజర్లకు అలవాటు. ఈ చిన్న స్టేషనులో ఇంత సేపు కూర్చుంటే ఎలా? అనకా ప

చేరడమెప్పుడు, గిరిగాడ్ని వెతికి పట్టుకొని వాడికి నా సోదంతా వెళ్ళబోసి, వీలైతే కాళ్ళూ చేతులూ పట్టుకొని వొప్పించి తిరిగి సాయంత్రంలోగా వాల్తేరు చేరడమెప్పుడు? గిరి నచ్చచెపితే నాన్న వొప్పుకుంటారా? ససేమిరా వీల్లేదంటే? నా విజయ సంగతేం కావాలి? నాన్న ఇష్టాయిష్టాలతో ప్రమేయం లేకుండా, మా మాట వినవాలని దీనంగా చూసే అమ్మ మాట త్రోసి పుచ్చి, విజయను రిజిస్టరు మేరేజి చేసుకుంటే?...ఆలోచిస్తున్న కొలదీ సమస్య మరీ బరువుగా తయారవుచున్నది. భుక్తాయాసం తీర్చుకున్న భోక్తలా ట్రయిను మెల్లగా కదిలింది. చదువుకోవడానికి ఏదైనా పుస్తకం వుంటే బాగుండును. ఏది చూసుకోడానికైనా టైము చాలా తక్కువ. అవతల ఆఫీసు శలవుకోసం తిరిగే సరికి సరిపోయింది.

ఆమె దగ్గర ఏదో పుస్తకం వున్నది. అడిగితే బాగుండును అనిపించింది. కాని మొదటి నుంచీ నా కెందుచేతనోగాని ఆమె పైని మంచి అభిప్రాయం కుదరలేదు. అందుకు కారణం—ఆమె లేడీస్ కంపార్టుమెంటువదిలి, వొంటరిగా మామూలు కంపార్టుమెంటులో ప్రయాణం చెయ్యడం అనుకుంటాను. ఇలా కావాలని వొంటరిగా ప్రయాణం చేస్తూ, పెద్ద రిచ్ లేడీస్‌గా నటిస్తూ పొట్టపోసుకొనే కొందరి యువతుల కథలు నాకు తెలుసు. ఆమె సర్దుకొని కూర్చుంది. ఎదుటి సీటుమీద వయ్యారంగా కాలు ఆన్చి మూలగా చేరబడింది. అందమైన గుండ్రని ముఖం. నుదుట ఏటవాలుగా దిద్దుకున్న తిలకం, సన్నగా నునుదేరిన శరీర వొంపులు, పచ్చటి శరీరచ్ఛాయ, గాలికి అందగా నుదురుపై ఆడే ముంగురులు, చవుకబారు కోణం నుంచి చూడకపోతే, ఆమె చక్కని అందగత్తె అని వొప్పుకోవచ్చు. ఆమె కనుబొమల్ని నిద్రకు రెపరెపలాడిస్తున్నది. క్రమేణా బండి జోపుకి వుయ్యాలలో చంటిపాపలా ఒకప్రక్కలకు తల ఆన్చి, నిద్రలో మునిగిపోయింది.

నా విజయ ముందు ఈవిడ అందమెక్కడ? అసలు విజయకూ ఈవిడకూ పోలికలేమిటి? నాబుద్ధి తక్కువ కాకపోతే! విజయను ప్రేమించి, ఆమె అంగీకారం పొందిన నేను నిజంగా అదృష్టవంతుడనే! ఆ మాటే ఆఫీసులో అందరూ అంటారు 'యూ ఆర్ ఎ డామ్ లక్కీ లవ్ బర్డ్' అని—

నాకు ముందునుంచీ ఆఫీసులో పనిచేస్తూన్న విజయను ఏదో మాటలనో లేక కవ్వించో తిరిగి ఘాటైన సమాధానం పొంది, మళ్ళా నోరెత్తకుండా తాళం వేసుకున్నవారే అందులో పనిచేస్తున్న ఇంచుమించు నా వయస్సు కుర్రకారంతా! మొదట అంతా అనుకున్నారట. వాళ్ళకు పట్టిన గతి నాకెప్పుడు వస్తుందో అని. కాని, అందుకు విభిన్నంగా మారి, మాకు ఇదివరలో ఎంతో పరిచయం వున్నట్లు కలిసి మెలిసి తిరగడం చూసి, కథ అడ్డం తిరిగిందని కొందరు కళ్ళునిలుపుకొని చూసారు. కొందరు వారు వింటున్నది నిజమే అని బోలెడు ఆశ్చర్యపోయారు. కథలు పుట్టించారు. వాటిని


మా ఖాతాదారులకూ - శ్రేయోభిలాషులకూ హృదయపూర్వకమైన
దీపావళి అభినందనలు!!

దీపావళినాడు యావత్ భారత ప్రజలందరూ మా టపాసు
రకాలను వాడి ఆనందము పొందాలని
ఆశిస్తున్నాము!!

ROYAL FIREWORKS INDUSTRIES

Tel : "ROYAL" SIVAKASI (S. I.) Phone: 22

Phone: 54 & 254 Estd. 1936 Grams: "CORONATION"

**THE CORONATION LITHO WORKS,**

**Post Box No. 2 :: SIVAKASI.**

*A Reputed Firm for:*

Printing of High Class Multi-colour Calendars, All Trade Labels

and for quality

Reproductions of EKTACHROME COLOUR TRANSPARENCIES

for Calendars.

**Your enquiries for our 1966 calendars are very welcome.**

*Branch Office:*
**150-A/3, Khivraj Mansion,**
**Mount Road, Madras-2.**

*Sales Depot.*
**217, Samuel Street,**
**Vadgadi, Mandvi Post,**
**Bombay-3.**

చిలవలు పలవలూగా అల్లి, క్లయిమాక్సుకోసం ఎదురు చూసారు. నా కాలేజీ రోమాన్సుకి కొంత రంగుపులిమి, వీలైనంత కద సేకరించి ఆమె ముందు వుంచారు మరి కొందరు మహానుభావులు. విజయ నవ్వి వూరుకునేది. ఈ అలజడి ఆఫీసరువరకూ పోయింది. ఒకరోజు ఆయన అడిగారు. నిజమే అనిచెప్పి, పెళ్ళి చేసుకుంటామని యిద్దరం చెప్పాం. సంతోషంగా నవ్వి. 'వెరీగుడ్, అలా వుండాలి నమ్మకమంటే-కంగ్రాట్యులేషన్సు. ముహూర్తం ఎప్పుడు? ముందుగా చెప్పండి' అని దీవించారు.

రైలు ఒక్క కుదుపుకుదిపి, అనకాపల్లి స్టేషనులో ఆగింది. ఆలోచనలులోనుంచి తేరుకుని ఆమె వైపు చూసాను. గబుక్కున మెలకువ వచ్చి నలుదిక్కులూ చూసింది. నేను ట్రయిను దిగి స్టేషను బయటకు వచ్చాను. గిరి ఇంటి అడ్రసు నాకు తెలీదు. కాలేజీలో లెక్చరుగా పనిచేస్తున్నట్టు మాత్రం తెలుసు. రిక్షా కాలేజీ వైపు పోనిమ్మన్నాను. వాడికి పెళ్ళయి రెండేళ్ళయింది. అంతకు ముందు వాడిని చూడడమే. పెళ్ళికి వెళ్ళడం పడలేదు.

స్టాఫ్ వెయిటింగు రూములో కనుక్కుంటే—ఏదో క్లాలో వున్నాడని, ఒక పావుగంటలో వచ్చేస్తాడని చెప్పారు. బల్లపైని పడివున్న పేపరును తిరగవేస్తూ కూర్చున్నాను. గిరి నాన్నగారి ముఖ్య స్నేహితుని కొడుకు. చిన్నబందుత్వం కూడా వుంది. గిరి తెలివైనవాడు, మంచివాడు అని నాన్నగారి నమ్మకం. స్నేహితుని పట్లవుండే విస్వాసం గిరిపై కుదిరాయి. అందుకే వీడిపైని నాకు కొండంత ఆశ.

పిరియడు బెల్లు మ్రోగింది. నిశ్శబ్దంగా వుండే వాతావరణం అంతా ఒక్కసారిగా మారిపోయింది. చేతులూపుకుంటూ గదిలో అడుగు పెట్టిన గిరి నన్ను చూసి ఆశ్చర్యపోయాడు.

"హల్లో! హవుడూ యూడూ?...ఎప్పుడు వచ్చావు? ...ఎక్కడనుంచి వూడిపడ్డావ్? ఎంతసేపైంది వచ్చి? ...నాకు కబురు చెయ్యలేదేం?"

నన్ను వుక్కిరి బిక్కిరిచేసి, సమాధానం అయినా చెప్పక ముందే కాలేజీకేంటిన్ వైపు లాక్కుపోయాడు. పరవాలేదు. వీడు అప్పటికీ ఇప్పటికీ ఏమీ మారలేదు.

కేంటిన్‌లో కొంచెం వూపిరి తీసుకోడానికి అవకాశం దొరికింది. అక్కడ నా విషయమంత చెప్పాను. నా విజయలేందే బ్రతకలేనని చెప్పాను.

గిరి దీర్ఘంగా ఆలోచిస్తున్నట్టు ముఖం పెట్టి, రెండు స్ట్రాంగ్ కాఫీలకి ఆర్డరిచ్చాడు.

"అయితే వ్యవహారం అంతవరకూ వచ్చిందన్న మాట" అన్నాడు.

"మరి... నువ్వాదుకోపోతే నాపని గోవిందోహరి"

"పరవాలేదు. దీనికి సరైన ప్లాను ఆలోచిద్దాం' ముందు యింటికి పద" అన్నాడు. ఇద్దరం లేచాం.

వాడు ఒకమారు స్టాప్ వెయిటింగు రూములోకి వెళ్ళి వచ్చాడు.

దారిలో నా ప్రయాణపు సంగతులు వచ్చాయి. పొరపాటున నాలుక వొర్లి నాతోపాటు ప్రయాణం చేసిన ఆవిడ విషయం కూడా వచ్చింది.

వుపన్యాసం యిచ్చేవాడేమో, పైగా లెక్చరరు పదవి వెలిగిస్తున్నాడు, మరి—ఇంతలో వాడి ఇల్లు రాబట్టి ఆగాడు. నేను వూపిరి తీసుకున్నాను. వీధిగేటు తీస్తూ అన్నాడు "అన్నట్టు మర్చిపోయాను సుమా... మా శ్రీమతిని నీకు పరిచయం చేసే అదృష్టం లేదు. మా బుల్లి బావమరిదితో అర్జంటుగా పుట్టింటికి వెంచేసి మూడు రోజులయింది, ఎక్స్‌క్యూజుమి" మరుక్షణంలోనే అరె!, "తలుపు తాళం ఎవరో తీసారే" అన్నాడు.

గతుక్కుమన్నాను. వీధి తలుపు వైపు చూస్తే నిజమే—తాళం వేసిలేదు! తలుపు దగ్గరగా చేరవేసివుంది. గిరి నా ముఖంలోకి చూసాడు అయోమయంగా. ఒక వేళ దొంగలు పడ్డారేమో!...ఛ—పట్టపగలు దొంగలేమిటి? "పద" అన్నాను.

వణుకుతున్న చేత్తో తలుపు తట్టాడు గిరి!

లోపల గెడతీసిన చప్పుడయి ఒక తలుపు తెరుచుకుంది.

ఆమె?!......

మరెవరోకాదు. నాతో పాటు వొంటరిగా ప్రయాణం చేసిన ఆవిడే!

నా గుండె దడదడ లాడింది కీడు శంకిస్తు.

ఆమె లోనకు తప్పుకుంటూ నన్ను చూసి గిరితో "అతను" ఎవరు అన్నట్టు అర్థోక్తితో ఆగిపోయింది.

"అతడు నా స్నేహితుడులేగాని, నువ్వేం చెప్పకుండా చెయ్యకుండా ఇంత అర్జంటుగా తిరిగి వచ్చేసావ్?" మధ్య గదిలోకి అడుగు పెడుతూ భార్యను అడిగాడు.

నేను వీధి వసారాలోవున్నాను. గుండె దడ ఇంకా తగ్గలేదు. నాతో వొంటరిగా ప్రయాణం చేసింది వాడి భార్యానే అని గిరికి తెలియకుండా వుంటే బావుండును నేనైనా ముందు చెప్పడం మానేయవలసింది...ఛా! నాలుక కోసుకున్నా పాపంపోదు.

పక్కగదిలో ఆమె భర్తతో మెల్లగా ఏమో చెప్తున్నది.

"...చూస్తూ చూస్తూ ఎవరైనా ఇటువంటి అదోగతి సంబంధం చేస్తారా? ... నాన్న అయితే తక్కువ కట్నంకదా అని సంతోషపడుతున్నారు ... అసలు సంగతి తెలిస్తే ఆ రౌడీ వెధవకు ఎవ్వరూ పిల్లనే యివ్వరు...కాలేజీలోని ఒక అమ్మాయిని ఏం చేసాడో రెండేళ్ళు డిబార్ చేసారట! అప్పటికైనా బాగుపడ్డాడా—మళ్ళీ తను పనిచేస్తున్న ఆఫీసులో బామలబాను, బానో బామో, ఆవిడతో ప్రేమ పాటాలు వల్లి వేస్తున్నాడట.

అంతకన్నా నాపైని బాంబుపడినా అదిరేవాడని కాదేమో! నా బాను గురించా వీళ్లు అనుకుంటున్నది?!..

"...లలిత ఒక ప్రక్క ఏడుపు. అన్నయ్య ఇవన్నీ తెలుసుకున్నాడు. రాత్రంతా నాన్నతో ఒకటే గొడవ రేపు వచ్చేవాళ్ళను రావద్దని వుత్తరం రాయమంటాడు అన్నయ్య. వీల్లేదంటారు నాన్న. దానికి ఇష్టంలేని సంబంధంచేసే బదులు పీకపిసికెయ్యండి అని నాన్నతో తగువుపెట్టుకొని వచ్చేసాను."

నాకు విషయం అర్థమయి శరీరమంతా ముచ్చెమటలు పోసాయి. భగవాన్ ఇటువంటి పరిస్థితి ఏవొక్కరికీ రాకూడదు.

"ఇంటి అందరూ వద్దన్నా మీ నాన్న మూర్ఖత్వమేమిటి?" గిరి అంటున్నాడు.

"ఏమో? ఎలాగో చేసుకోనివ్వండి"

"ఎలా చేస్తారేమిటి? మీ నాన్నకు వుత్తరం రాస్తాలే"

"అది సరే కాని, అతన్ని అవతలేవుంచేసారు"

(తరువాయి 72వ పేజీలో)

సమాజానికి నీతి గూర్చి భావాలే తప్ప నీతికాదు.

—చల్లం.

హాస్యం చెప్పడంలో నేను అవలంబించే మార్గం నిజాన్ని చెప్పేయటమే. ఎందుకంటే నిజం చెప్పడమంత హాస్యం ప్రపంచంలో మరోటి లేదు.

—బెర్నాడ్ షా.

సంతోషంకోసం బ్రతుకుతున్నాం. బ్రతుకుతున్నందుకు కూడా సంతోషించాలి.

—శామ్వల్ జాన్ సన్స్.

ఎక్కడో, ఎప్పుడో, పుట్టడం, ఎవరో, ఎవరోన్ని వప్పగిస్తే వార్ని పెళ్లాడ్డం, ఎందుకో తెలియకుండా పిల్లల్ని కడం, ఎప్పుడో, చచ్చిపోవడం-యిది చాలా మంది చేస్తున్నది. దీని గురించి, కథగా చెప్పుకునేందుకు ఏముంది?

—బుచ్చిబాబు.

(12 వ పేజీ తరువాయి

''అరే మర్చిపోయాను. నువ్వు ముందు వంట ఏర్పాటు చూడు'' గిరి బయటకు వచ్చాడు.

నే నింకా అక్కడ ఎందుకుంటాను? ఎలా వుండగలదు?

కుర్చీమీద గిరి కోసం ఈ చిన్న చీటీ వదిలాను—

గిరీ!

తెలియక నేనేదైనా తప్పుచేస్తే క్షమించవలయును. మీరనుకున్నంత నీచంగా నేనేం ప్రవర్తించలేదు. కాలేజీ రోజుల్లో మమ్మల్ని చూడలేక, విపరీతార్ధాలు సృష్టించి వెళ్లగొట్టించినంత మాత్రాన పిరికి పందలమై పోలేదు. కొలది రోజులలో నేను వివాహం చేసుకోబోతున్నది నా విజయబాను నే! శలవు.

— మిత్రుడు మూర్తి.

# 'అగ్గిభరాటా' చిత్ర ప్రారంభోత్సవం

## విఠల్ ప్రొడక్షన్సువారి విక్రమకేళి

విఠల్ ప్రొడక్షన్సు అండ్ కో వారి జానపద చిత్రం 'అగ్గిభరాటా'కు యీమధ్య వాహినీ స్టూడియోలో ప్రారంభోత్సవం జరిగింది. పూర్ణా పిక్చర్సు అధినేత శ్రీ జి. [illegible]రాజు ఛాయాగ్రహణ యంత్రంయొక్క మీట నొక్కారు.

మొదటి షాట్‌లో శ్రీ ఎన్. టి. రామారావు, అభినేత్రి రాజశ్రీ ఉన్నారు. 'జయం మనదే' అంటూ శ్రీ రామారావు ఉత్సాహపరచగా రాజశ్రీ ఆయనవద్ద సెలవుతీసుకొని రాజప్రాసాదంలోకి వెళ్లిపోతుంది.

రాజప్రాసాదం సెట్ శిల్పకళావిలసితంగా అలరారింది. ఈ చిత్ర నిర్మాత, దర్శకుడు, శ్రీ విఠలాచార్య విశేష ధన వ్యయంచేసి యీ చిత్రాన్ని రూపొందిస్తున్నారు. అందుచేత సెట్లలో, ఆహార్యంలో ఉన్నత ప్రమాణాలు మనకు అవశ్యం అగపడతాయి.

'అగ్గిభరాటా'లో వీర, రౌద్ర, అద్భుత, భయానక రసాలు ప్రాధాన్యం వహిస్తాయని వేరే చెప్పక్కర్లేదు. శ్రీ విఠలాచార్య యీ రసాలను వెలుగునీడల్లో చిత్రించడంలో గొప్ప మేధావులు. శ్రీ జి. కృష్ణమూర్తి యీ చిత్రానికి మాటలను, శ్రీయుతులు నారాయణరెడ్డి, కొసరాజు, దాశరధి పాటలను సమకూరుస్తున్నారు.

Edited and Published by A.N. Raghavachar, No, 32, Krishnappa Naick Tank St, MadrasI
Printed by V Kuppuswamy Chetty Bharathamatha Press, No. 39, Anderson St;, Madras-I